
సాక్షి ఒడిశా

ఆదివారం । 23 । జూలై । 2023



శ్రీమందిరం ఆదాయం లెక్కింపు

భువనేశ్వర్: పూరీ జగన్నాథాలయం హుండీలో భక్తులు కానుకల రూపంలో సమర్పించిన ఆదాయాన్ని పాలక వర్గం శనివారం లెక్కించారు. ఇందులో నగదు రూ. 5,71,835లు, బంగారం 7.1 గ్రాములు, వెండి 28.1 గ్రాములు వచ్చాయని అధికారులు తెలిపారు.



మహిళా సాధికారతే విజయ మంత్రం

- 8లో

నేడు రక్తదాన శిబిరం

రాయగడ: బీజేడీ రాష్ట్రశాఖ ఉపాధ్యక్షుడు నెక్కంటి భాస్కరరావు పుట్టినరోజు సందర్భంగా స్థానిక బాలికల ఉన్నత పాఠశాల మైదానంలో ఆదివారం ఉదయం మెగా రక్తదాన శిబిరం నిర్వహించనున్నట్లు పార్టీ నాయకులు శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. అలాగే వివిధ సేవా కార్యక్రమాలు, నెక్కంటికి సన్మానం చేయనున్నట్లు వివరించారు. అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొని, విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

న్యూస్‌రీల్

మెరుగైన సేవలందించాలని ఆందోళన



ఎంకేసీజీ ఎదుట ఆందోళన చేస్తున్న శురక్షామంచ్ ప్రతినిధులు

బరంపురం: దక్షిణ ఒడిశా ప్రజలకు ఆరోగ్య కేంద్రంగా నిలిచిన బరంపురం నగరంలోని ఎంకేసీజీ మెడికల్ కళాశాలలో బాధితులకు మెరుగైన సేవలు అందించే విధంగా చర్యలు చేపట్టాలని కన్వీనర్ అబనీకుమార్ గయా కోరారు. ఎంకేసీజీ ప్రాంగణలో మానవ అధికారి శురక్షా మంచ్ ఆందోళన ఆధ్వర్యంలో శనివారం ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎంకేసీజీకి చికిత్స కోసం ప్రజలు ఎంతో నమ్మకంతో వస్తారని, దానిని వమ్ము చేయకుండా తగు సేవలు అందించాలని కోరారు. అధునాతన చికిత్స అందించేలా చికత్సా పరికరాలు, మౌలిక సౌకర్యాలు కల్పించేందుకు రాష్ట్రప్రభుత్వం నిధులు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు.

ధాన్యం కొనుగోళ్లపై ప్రచారం

పర్లాకిమిడి: ఖరీఫ్ ధాన్యం కొనుగోళ్లకు సంబంధించి రైతులు తమ సమీపంలోని సహకార సొసైటీలు, ల్యాంప్ కార్యాలయాల వద్ద వివరాలను నమోదు చేసుకోవాలని జిల్లా కలెక్టర్ స్మృతిరంజన్ ప్రధాన్ సూచించారు. ఈ మేరకు కలెక్టరేట్ వద్ద ప్రచార రథాన్ని ఆయన శనివారం జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జిల్లావ్యాప్తంగా 43 సహకార సంఘాలు, రెండు ల్యాంప్ సొసైటీలతో పాటు 45 కొనుగోలు కేంద్రాలు ఉన్నాయని తెలిపారు. రైతులు కొనుగోలు దరఖాస్తుతో పాటు తమ భూమి పట్టా, ఆధార్ కార్డుతో సహకార సంఘాల కార్యాలయాలు లేదా వెబ్‌సైట్‌లో నేరుగా నమోదు చేసుకోవచ్చని జిల్లా పౌర సరఫరాలశాఖ అధికారి ప్రఫుల్లకుమార్ బెహరా వివరించారు. కార్యక్రమంలో అసిస్టెంట్ సివిల్ సప్లై అధికారి స్నేహాసినీ బెహరా, గుసాని సమితి డీపీఆర్‌ఓ భవానీశంకర బెహరా, శుబేంధు పాణిగ్రాహి, సహకార సంఘాలు, రెగ్యులేటెడ్ మార్కెట్ కమిటీ శాఖ అధికారులు పాల్గొన్నారు.



ప్రచార రథాన్ని ప్రారంభిస్తున్న కలెక్టర్ స్మృతిరంజన్

బాలలకు రగ్గులు పంపిణీ

రాయగడ: పట్టణంలోని మణిదీప్తి మహిళా సంఘం సేవా కార్యక్రమంలో భాగంగా రైతుల కాలనీ నవజీవన్ ట్రస్ట్‌లో ఆశ్రయం పొందుతున్న ఆదివాసీ బాలలకు రగ్గులు, ఇతర ఉపకరణాలను శనివారం పంపిణీ చేశారు. మున్సిపాలిటీ చైర్మన్ మహేష్ పట్నాయక్ ముఖ్యఅతిథిగా హాజరై, వీటిని అందజేశారు. మహిళా సంఘాలు ఇటువంటి సేవా కార్యక్రమాలను చేపట్టడం హర్షించదగ్గ విషయమన్నారు. పట్టణంలో ఇటువంటి సంస్థలు ముందుకు వచ్చి బాలలకు అండగా నిలచేలా తమ సేవా కార్యక్రమాలను విస్తరించాలని పిలుపునిచ్చారు. ట్రస్ట నిర్వాహకురాలు ఎం.నలినీ, సభ్యులను అభినందించారు.



రగ్గులు పంపిణీ చేస్తున్న చైర్మన్ మహేష్ పట్నాయక్

25నుంచి రాష్ట్రపతి పర్యటన

భువనేశ్వర్: భారత రాష్ట్రపతి ద్రౌపది ముర్ము 3రోజుల రాష్ట్ర పర్యటన ఈనెల 25నుంచి ప్రారంభం కానుంది. ఆరోజు ఢిల్లీ నుంచి ప్రత్యేక విమానంలో భువనేశ్వర్ లోని బిజూ పట్నాయక్ అంతర్జాతీయ విమానాశ్రయానికి చేరుకొని, రాత్రికి రాజ్‌భవన్‌లో బస చేస్తారు. 26న కటక్‌లో జరగనున్న పలు కార్యక్రమాల్లో పాల్గొంటారు. 27న తొమాండొ దస్‌బటియా ప్రాంతంలో ప్రజాపిత బ్రహ్మకుమారి డివైన్ లైట్‌హౌస్ ఏర్పాటుకు శంకుస్థాపన చేయనున్నారు. అనంతరం బలియాడా ప్రాంతంలో ఏర్పాటు చేయనున్న బహిరంగ సభలో ప్రసంగిస్తారు.ఈ సందర్భంగా ఆద్యంతాలు మూడంచెల భద్రతా ఏర్పాట్లు చేస్తున్నారు. బ్లూ బుక్ వివరాల ప్రకారం ఏర్పాట్లు చేస్తున్నట్లు అదనపు డీసీపీ పీకే రౌత్ శనివారం తెలిపారు. పర్యటన సమయంలో రాష్ట్రపతి ప్రయాణించే మార్గాల్లో బ్లాకింగ్ చేస్తారు. ఆమె ఆయా ప్రాంతాలు దాటడంతో బ్లాకింగ్ తొలగిస్తారు. సాధారణ ప్రజానీకానికి ఎటువంటి ఇబ్బంది లేకుండా ఈ మేరకు చర్యలు చేపడుతున్నారు. కటక్-భువనేశ్వర్ జంట నగరాల పోలీసు కమిషనరేట్ సమగ్రంగా 60 ప్లాటూన్ల పోలీసులను నియమిస్తున్నట్లు తెలిపింది.

క్లుప్తంగా

మానవత్వానికి మచ్చ!



చెత్త కుప్పలో లభ్యమైన పసికందు

మల్కన్‌గిరి: చిమ్మచీకటి.. జోరు వర్షంలో బస్తాలో చుట్టి, పసికందును విసిరేసిన తల్లిదండ్రుల కాఠిన్యానికి పిడుగులు కూడా మిన్నకుండిపోయాయి. జనం కంట కనిపించే వరకు మెరుపులే తోడుగా నిలిచి, ముక్కు పచ్చలారని చిన్నారిని కాపాడుకున్నాయి. మల్కన్‌గిరి జిల్లా కేంద్రంలో చోటు చేసుకున్న ఈ ఘటన మానవత్వానికి మాయని మచ్చగా తారస పడింది. వివరాల్లోకి వెళ్లే శనివారం వేకువజామున మల్కన్‌గిరి తోలాసాహి(దిగువ వీధి) వైపు వెళ్తున్న స్థానికులకు ఏడుపు వినిపించడంతో వెళ్లి చూడగా, చెత్తకుప్ప వద్ద బియ్యం బస్తాలో చుట్టి ఉన్న పసికందు కనిపించింది. వెంటనే చైల్డ్‌లైన్ సిబ్బందికి సమాచారం అందించడంతో పాటు మల్కన్‌గిరి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు.. బిడ్డ ఆరోగ్యంగానే ఉందని, పుట్టి ఒక రోజే కావస్తుందని తెలిపారు. ఆస్పత్రికి చేరుకున్న ఐఐసీ రీగాన్ కీండో కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు. పసికందు తల్లిదండ్రుల వివరాలపై ఆరా తీస్తున్నారు.

సీబీఎస్‌ఈలో భారతీయ భాషల బోధన

- కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్



ధర్మేంద్ర ప్రధాన్

భువనేశ్వర్: జాతీయ నూతన విద్యా విధానం(ఎన్‌ఈపీ)–2020 అమలులో భాగంగా సెంట్రల్ బోర్డ్ ఆఫ్ సెకండరీ ఎడ్యుకేషన్(సీబీఎస్‌ఈ), అనుబంధ పాఠశాలల్లో ఇంగ్లిష్, హిందీ భాషల ఎంపికలతో పాటు ఒడియాతో సహా బోధనా మాధ్యమంగా భారతీయ భాషలను ఎంపిక చేసుకునే అవకాశం అందుబాటులోకి వచ్చిందని కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ తెలిపారు. ఈ మేరకు సీబీఎస్‌ఈ తన అనుబంధ పాఠశాలలకు ఉత్తర్వులు జారీ చేసిందని శనివారం ప్రకటించారు. భారత రాజ్యాంగంలోని షెడ్యూల్ 8లో పేర్కొన్న భారతీయ భాషలను ప్రీ–ప్రైమరీ తరగతుల నుంచి 12వ తరగతి వరకు ఐచ్ఛిక మాధ్యమంగా, ఇతర అందుబాటులో ఉన్న ఎంపికలతో పాటు బోధనా మాధ్యమంగా ఉపయోగించవచ్చని పేర్కొన్నారు. 8వ షెడ్యూల్‌లో 22 భారతీయ భాష లు ఈ జాబితాలో చోటు చేసుకున్నట్లు గుర్తుచేశారు. భారతీయ భాషలను బోధనా మాధ్యమంగా చేర్చడం బహుభాషావాదాన్ని ప్రోత్సహించడం, భాషా వైవిధ్యాన్ని కాపాడేందుకు ప్రధాన సోపానంగా అభిప్రాయం వ్యక్తంచేశారు. వివిధ భాషల్లో విద్యను అందుబాటులోకి తీసుకురావడం ద్వారా సీబీఎస్‌ఈ విద్యార్థుల అభ్యాస అనుభవాన్ని మెరుగుపరచడం తోపాటు సాంస్కృతిక, భాషా గుర్తింపులతో వారి సంబంధాన్ని బలోపేతం చేయడమే లక్ష్యంగా ఈ చర్య చేపట్టినట్లు వివరించారు.

బాంబు దాడి కేసులో నిందితుల అరెస్ట్

బరంపురం: గంజాం జిల్లాలోని బుగడాలో మందుల దుకాణంపై ఈనెల 16న జరిగిన బాంబు దాడి కేసులో పరారైన నిందితులను పోలీసులు శనివారం అరెస్ట్ చేశారు. దీనిపై ఐఐసీ అధికారి చిత్రరంజన్ బెహరా తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. బుగడా పోలీసు స్టేషన్ పరిధిలోని మెడికల్ ప్రాంగణం వద్ద ఉన్న దుకాణంపై దుండగులు నాటు బాంబులతో దాడి చేసి, పరారయ్యారు. ఈ ఘటనలో ఇద్దరికి గాయలు కాగా, దుకాణంలోని ఔషధాలు, ఫర్నీచర్ ధ్వంసమయ్యాయి. దీనిపై బాధిత యజమాని సంతోష్‌కుమార్ పోలీసులకు ఫర్యాదు చేశారు. కేసు నమోదు చేయగా, దర్యాప్తు చేయడంతో పాటు ఏడుగురు నిందితులను అరెస్ట్ చేశారు. వారి నుంచి 2 బైక్‌లు, సెల్‌ఫోన్, నాటు తుపాకీ, 2 నాటు బాంబులు స్వాధీనం చేసుకున్నారు.

దుకాణాల్లో ముమ్మర తనిఖీలు



మార్కెట్‌లో మాంసం దుకాణంలో తనిఖీ చేస్తున్న అధికారులు

పర్లాకిమిడి: పట్టణంలో లైసెన్సులు లేకుండా మాంసం విక్రయిస్తున్న దుకాణాల్లో మున్సిపల్ శాఖ, ఆహర భద్రతా విభాగం అధికారులు శనివారం ముమ్మర తనిఖీలు చేపట్టారు. సంబంధిత వ్యాపారులపై అపరాధ రుసుం విధించారు. మున్సిపల్ కౌన్సిల్ నిబంధనలు అతిక్రమించి మాంసం విక్రయిస్తున్న దుకాణదారులు, టిఫిన్ బండి నిర్వాహకులపై రూ.30 వేల జరిమానా వసూలు చేశారు. ఫుడ్ లైసెన్సు, ట్రేడ్ లైసెన్సు లేని వారిపై చర్యలు తీసుకున్నారు. అలాగే 167 కిలోల పాలిథిన్ కవర్లను స్వాధీనం చేసుకున్నారు. దాడుల్లో పురపాలక శాఖ ఎగ్జిక్యూటివ్ అధికారి వనమాలి శత్పతి, జిల్లా ఆహార తనిఖీ అధికారి తపస్వినీ బెహేరా, పోలీసులు, మున్సిపల్ సిబ్బంది కలిసి పాల్గొన్నారు.

ఋతురాగాలు..



పర్యాటకులను ఆకర్శిస్తున్న కొరాపుట్ ఘాట్ రోడ్డు




కొరియా లోయలో మంచు దుప్పటి



దమంజోడి లోని నాల్కో వద్ద పచ్చదనం

గత వారం రోజులుగా ఎడతెరిపి లేకుండా కురుస్తున్న భారీ వర్షాలకు కొరాపుట్ జిల్లాలోని దండకారణ్య అందాలు పర్యాటలను రారమ్మని ఆహ్వానిస్తున్నాయి. వర్ష రుతువుతో ఇక్కడ లోయలు, కొండలు పచ్చదనంతో నిండిపోయాయి. వాగులు ప్రవహిస్తుండటంతో కొండలపై నుంచి నీటి ఊటలు ధారలుగా బయటకు వస్తున్నాయి. ఘాట్ రోడ్లలో ప్రయాణం ఆహ్లాద పరుస్తోంది. దమంజోడిలోని భారత అల్యూమినియం కేంద్రం(నాల్కో), ఆంధ్రా–ఒడిశా సరిహద్దు ప్రాంతం కొఠియా, అత్యంత ఎత్తయిన పర్వతం దేవమాలి ప్రాంతాల్లో పుడమి.. పచ్చని చీర కప్పుకున్నట్లు కనువిందు చేస్తోంది. మంచు దుప్పటి మోసుకుంటూ పరుగులు తీస్తున్న మేఘాలు ఆకర్శస్తున్నాయి. – కొరాపుట్



దేవమాలి వద్ద ప్రకృతి అందాలు

ఏరువాక వద్ద ఎమ్మెల్యేల సందడి



గిరిజనులకు గొడుగులు అందిస్తున్న ఎమ్మెల్యే మనోహర్ రంధారీ



వ్యవసాయ కూలీలకు పాలిథిన్లు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే సదాశివ ప్రధాన్

కొరాపుట్: కుండపోత వర్షాలపై గిరిజనులంతా వ్యవసాయ పనుల్లో నిమగ్నమయ్యారు. దీంతో ఆయా ప్రాంతాల్లో పర్యటించేందుకు వెళ్లిన ఇద్దరు ఎమ్మెల్యేలు నేరుగా పొలం పనులు జరుగుతున్న ఏరువాక వద్దకే వెళ్లారు. ఈ ఏడాది వర్షాలు ఆలస్యం కావడంతో నవరంగ్‌పూర్ జిల్లాలో ఆందోళనకర వాతవరణం నెలకొంది. జిల్లాలో 90శాతం పంటలు వర్షాధారంగానే సాగుతున్నారు. ఎట్టకేలకు వరుణుడి కరుణించడంతో గ్రామాలు పూర్తిగా ఖాళీ అయ్యాయి. ఉదయం నుంచి రాత్రి వరకు గిరిజనులు అలుపెరగకుండా పొలాలకే పరిమితం అవుతున్నారు. ఈ ప్రాంతంలో గిరిజనులు పనుల సమయంలో వర్షం నుంచి రక్షించుకునేందుకు పాలిథిన్లు వంటికి చుట్టుకొని నిరవధికంగా పని చేస్తారు. ఒక్కసారిగా వీటికి డిమాండ్ పెరిగి లభ్యం కావడం కష్టంగా మారింది. ఈ నేపథ్యంలో నవరంగ్‌పూర్ ఎమ్మెల్యే సదాశివ ప్రధాన్, డాబుగాం ఎమ్మెల్యే మనోహర్ రంధారి రోజూ తమ వాహనాల్లో పాలిథిన్లు, గొడుగులు, బిస్కెట్లు వేసుకొని ఏరువాక ప్రాంతాలను సందర్శిస్తున్నారు. అక్కడ గిరిజనులకు వీటిని పంపిణీ చేస్తున్నారు. సాయంత్రం తమ నియోజకవర్గాల్లో ఇదే కార్యక్రమం కొనసాగిస్తున్నారు. పలువురు అధికారులు, ప్రజలు సైతం పొలాల వద్దే ఇరువురి కోసం వేచి చూస్తున్నారు.

గుట్టుచప్పుడు కాకుండా..!

- నవరంగ్‌పూర్‌లో టికెట్ కౌంటర్ మూసివేసిన రైల్వే అధికారులు

కొరాపుట్: నవరంగ్‌పూర్ జిల్లా ప్రజలకు రైల్వే శాఖతో ఉన్న ఒకే ఒక్క అనుబంధం తెగిపోయింది. జిల్లాలోని ఏకైక రైల్వే టికెట్ కౌంటర్‌ను అధికారులు మూసి వేశారు. గత 4రోజులుగా టికెట్ కోసం వెళ్తున్న ప్రయాణికులు.. కౌంటర్ తెరవక పోవడంతో ఆరా తీయగా అసలు విషయం వెలుగులోకి వచ్చింది. అయితే చడీచప్పుడు లేకుండా సామగ్రి తరలించడం పలు అనుమానాలకు తావిస్తోంది. రాష్ట్రంలో రైల్వేస్టేషన్లు లేని జిల్లాలు 4కాగా, ఇందులో నవరంగ్‌పూర్ కూడా ఉంది. గతంలో రైల్వే టికెట్ల కోసం ప్రజలు 44 కిలోమీటర్లు ప్రయాణించి, కొరాపుట్ జిల్లా జయపురం రైల్వేస్టేషన్‌కు వెళ్లేవారు. అనేక వినతుల అనంతరం రాష్ట్రప్రభుత్వం భవనం, విద్యుత్ సమకూర్చితే తాము కౌంటర్ ఏర్పాటు చేస్తామని రైల్వే అధికారులు ప్రకటించారు. ఈ ఒప్పందంతో స్థానిక ప్రైవేట్ బస్టాండ్ ఆవరణలో రాష్ట్రప్రభుత్వం భవనం కేటాయించింది. ఇందులో రోజుకు కనీసం 25టిక్కెట్లు విక్రయాలు జరగాల్సి ఉంది. 2నెలల నిబంధనలకు అనుగుణంగా కొనుగోళ్లు లేవనే సాకు చూపుతూ కౌంటర్ మూసివేయడానికి అధికారులు ప్రయత్నాలు చేయగా, స్థానికులు అభ్యంతరం వ్యక్తం చేయడంతో కొనసాగించారు. కొద్ది రోజులకే ఒప్పందం ప్రకారం జిల్లా అధికార యంత్రాంగ విద్యుత్ బిల్లు చెల్లించలేదని మరోసాకు చూపుతూ కౌంటర్‌ను ఎత్తివేసినట్లు సమాచారం. దీనిపై డీఆర్‌యూసీసీ మాజీ సభ్యుడు భీమో హరిజన్ స్పందిస్తూ నవరంగ్‌పూర్ పార్లమెంట్ సభ్యుడు రమేష్‌చంద్ర మాఝికి ఫిర్యాదు చేశారు. ప్రస్తుతం పార్లమెంట్ సమావేశాల్లో ఉన్న ఆయన.. ఈ వ్యవహారంపై సభలో ప్రస్తావిస్తానని ప్రకటించారు.




నరంగ్‌పూర్‌లో మూసివేసిన రైల్వే టికెట్ కౌంటర్

మహిళా సాధికారతే విజయ మంత్రం

- బీజేడీ కార్యవర్గ సమావేశంలో పార్టీ అధ్యక్షుడు నవీన్ పట్నాయక్
- చట్టసభల్లో మహిళా రిజర్వేషన్‌కు పోరాడతామని హామీ



సమావేశానికి హాజరైన మహిళా ప్రముఖులు



కార్యవర్గ సమావేశంలో మాట్లాడుతున్న సీఎం నవీన్ పట్నాయక్

భువనేశ్వర్: మహిళా సాధికారత తన హృదయానికి అత్యంత చేరువలో ఉంటుందని బిజూ జనతాదళ్(బీజేడీ) అధ్యక్షుడు, ముఖ్యమంత్రి నవీన్ పట్నాయక్ అన్నారు. మహిళా సాధికారత నినాదం మాత్రమే కాదని, బిజూ జనతా దళ్ ప్రగతి, విజయ మంత్రమని పేర్కొన్నారు. పార్టీ ప్రధాన కార్యాలయం భువనేశ్వర్ లోని శంఖ భవనంలో శనివారం జరిగిన బీజేడీ రాష్ట్ర కార్యవర్గ సమావేశంలో ఆయన మాట్లాడారు. మహిళా సాధికారత లేకుండా ఏ సమాజం, దేశం, రాష్ట్రం ఎప్పటికీ పురోగమించదని దృఢ విశ్వాసాన్ని ప్రకటించారు. రాష్ట్రంలో అతివలు అన్ని రంగాల్లో రాణించడం సంతోషకరమన్నారు. రాష్ట్రాభివృద్ధిలో అన్ని రంగాల్లో వీరి పాత్ర స్పష్టంగా తారసపడుతుంది. రాష్ట్ర అభివృద్ధిలో సైతం సమాన భాగస్వాములుగా మారారని అభినందించారు. ప్రస్తుతం గ్రామాల్లో మహిళలు నాయకత్వ బాధ్యతలు చేపట్టి, పంచాయతీల అభివృద్ధిలో చురుగ్గా పాల్గొంటున్నారని తెలిపారు. మిషన్‌శక్తి మహిళల శక్తికి కేంద్రంగా మారిందని సంతృప్తి వ్యక్తంచేశారు. వరి సేకరణ, నగరాల్లో ఆధార్ కేంద్రాల నిర్వహణ, విద్యుత్ మీటర్ రీడింగ్, జల్ సాథీ, 5టీ రూపాంతర పాఠశాలల వాచ్, వార్డు తదితర దైనందిన కార్యకలాపాల్లో మహిళలు తమ బాధ్యతలను సమర్థవంతంగా నిర్వర్తిస్తున్నారు. గ్రామ చెరువుల్లో చేపల పెంపకం, పట్టణ ప్రాంతాల్లో నీటి వనరుల పునరుద్ధరణ ఇలా ప్రతి రంగంలో మహిళలు ముందుంటున్నారు.

త్వరలో స్కూటర్ యోజన..

2022–23 ఆర్థికం సంవత్సరలో మహిళలకు రూ.11వేల కోట్లు రుణాలు మంజూరు చేశామని సీఎం నవీన్ వెల్లడించారు. అలాగే రూ.250 కోట్లకు పైగా వడ్డీ తిరిగి చెల్లించామన్నారు. వివిధ కార్యకలాపాలు పురస్కరించుకుని మహిళలు చురుగ్గా తిరుగాడే అవసరాలను తీర్చేందుకు స్కూటర్ యోజన త్వరలో ప్రారంభం అవుతుందని ప్రకటించారు. దీని కోసం రూ.లక్ష వరకు వడ్డీలేని రుణాలు అందిస్తామన్నారు. మహిళా చైతన్యం అభివృద్ధికి ఇది మరింత బలం చేకూరుస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. మిషన్ శక్తిని మరింత ముందుకు తీసుకు వెళ్లేందుకు, మహిళా పారిశ్రామికవేత్తలను తయారు చేసేందుకు బిజూ జనతా దళ్ పని చేస్తుందన్నారు. హక్కుల పరిరక్షణ అతి ముఖ్యమైన కార్యాచరణగా పేర్కొన్నారు. అట్టడుగు స్థాయిలో అతివల సాధికారత సాధించగా, రాష్ట్ర, జాతీయ స్థాయిల్లో ఈ సంఖ్య తక్కువగా ఉందన్నారు. పార్లమెంట్, అసెంబ్లీ నియోజకవర్గాల్లో మూడింట ఒక వంతు రిజర్వేషన్ కోసం అంతా గళమెత్తాలని పిలుపునిచ్చారు. మహిళల హక్కుల కోసం గ్రామాల నుంచి పార్లమెంట్ వరకు బీజేడీ పోరాటం కొనసాగిస్తుందని భరోసా ఇచ్చారు.

ఇష్టానుసారంగా దర్శనాలకు అనుమతి

- ఐఆర్‌బీఎన్ జవాన్‌పై చర్యలకు ఆదేశాలు



పూరీ జగన్నాథాలయం

భువనేశ్వర్: పూరీ జగన్నాథుని దర్శించేందుకు భక్తులకు ఇష్టానుసారంగా అనుమతించడంతో విధి నిర్వహణలో ఉన్న జవాన్ సస్పెన్షన్‌కు గురయ్యాడు. శనివారం ఓ భక్తుడి నుంచి మామ్మూళ్లు వసూలు చేసి, శ్రీమందిరం పశ్చిమ ద్వారం మీదుగా ప్రధాన ఆలయంలోకి వెళ్లేందుకు అనుమతించినట్లు ఆరోపణ. ఈ వ్యవహారంలో విధి నిర్వహణలో ఉన్న ఒడిశా సాయుధ దళానికి చెందిన ఇండియన్ రిజర్వ్ బెటాలియన్(ఐఆర్‌బీఎన్) జవాన్‌ను విధుల నుంచి తాత్కాలికంగా తొలగించారు. ఆలయానికి వచ్చే సందర్శకులపై నిఘా వేసేందుకు ఐఆర్‌బీఎన్ 3వ బెటాలియన్ జవాన్లను మొహరించారు. పశ్చిమ ద్వారం వద్ద విధులు నిర్వహిస్తున్న సుభాసిస్ దాస్.. ఆలయ నిర్వాహకుల ఆంక్షల ప్రకారం భక్తులను తూర్పుద్వారం మీదుగా మాత్రమే ఆలయంలోకి అనుమతించాల్సి ఉంది. మిగిలిన మూడు ద్వారాలను సేవకులు మాత్రమే ఉపయోగిస్తున్నారు. కోవిడ్–19 మహమ్మారి సమయంలో విధించిన పరిమితులలో భాగంగా సాధారణ భక్తుల ప్రవేశం నివారించారు. ఈ ఆంక్ష నిరవధికంగా కొనసాగుతోంది. అయితే పడమటి ద్వారం వద్ద ఉన్న సుభాసిస్‌కు ఓ భక్తుడు డబ్బులు ముట్టజెప్పి, ఆలయంలోకి వెళ్లేందుకు అనుమతించినట్లు ఓ అజ్ఞాత వ్యక్తి కెమెరాలో రికార్డు చేశాడు. ఈ వీడియో సోషల్ మీడియాలో వైరల్ కావడంతో ఇతర భక్తుల్లో తీవ్ర ఆగ్రహం వ్యక్తమైంది. ఈ నేపథ్యంలో స్పందించిన పూరీ ఎస్పీ కన్వర్ విశాల్ సింగ్ జవాన్‌ను సస్పెండ్ చేస్తూ ఆదేశాలు జారీ చేశారు. దీనిపై సమగ్ర విచారణ జరిపి, నివేదిక అందించాలని అదనపు ఎస్పీ సుశీల్ మిశ్రా, ఆలయ భద్రతా అధికారి కౌశిక్ మాయక్ లకు ఉత్తర్వులు జారీ చేశారు.

ట్రాఫిక్ నియమాలు పాటించండి

- దక్షిణాంచల్ డీఐజీ సత్యభ్రత్ భొయి



ట్రాఫిక్ నిబంధనలపై వివరిస్తున్న డీఐజీ సత్యభ్రత్

బరంపురం: ప్రతిఒక్కరూ ట్రాఫిక్ నియమాలు తప్పనిసరిగా పాటించాలని దక్షిణాంచల్ డీఐజీ సత్యభ్రత్ బొయి పిలుపునిచ్చారు. స్థానిక డీఐజీ కార్యాలయ సమావేశ మందిరంలో రేంజ్ పరిధిలోని పోలీసుల అధికారులతో ట్రాఫిక్ నిబంధనలపై చైతన్య సదస్సు శుక్రవారం సాయంత్రం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వాహనాలు నడిపే సమయంలో తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని, మద్యం సేవించి వాహనాలు నడపరాదని సూచించారు. ట్రాఫిక్ నిబంధనలు పాటిస్తూ డ్రైవింగ్ చేయడం వల్ల తమ ప్రాణంతో పాటు ఇతరుల ప్రాణాలను కూడా రక్షించవచ్చని తెలిపారు. మద్యం సేవించి, వాహనాలు నడిపే వారిపై కట్టిన చర్యలు తప్పవని స్పష్టంచేశారు. సమావేశంలో బరంపురం ఎస్పీ సరవణ్ వివేక్, ట్రాఫిక్ డీఎస్పీలు, ఐఐసీలు, వివిధ స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు.



సదస్సులో పాల్గొన్న పోలీసు అధికారులు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు

క్లుప్తంగా

గ్రంథాలయ ఉద్యోగుల సంఘ రాష్ట్ర కార్యవర్గం ఎన్నిక


ఉగ్రసేన


భాస్కర్‌రాజు


రామకృష్ణ

శ్రీకాకుళం అర్బన్: ఆంధ్రప్రదేశ్ గ్రంథాలయ ఉద్యోగుల సంఘ రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షునిగా బలగ గ్రంథాలయ అధికారి పి.ఉగ్రసేన ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ నెల 7న గుంటూరులో జరిగిన ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర గ్రంథాలయ సంస్థల ఉద్యోగుల సంఘం ఎన్నికలు జరిగాయన్నారు. సంఘ రాష్ట్ర అధ్యక్షునిగా ప్రకాశం జిల్లా గ్రంథాలయ అధికారి పి.వి.సుబ్బారెడ్డిని ఎన్నుకోగా, కార్యవర్గాన్ని శుక్రవారం(ఈ నెల 21వ తేదీ) రాత్రి ఎన్నుకున్నట్లు పేర్కొన్నారు. శ్రీకూర్మం గ్రంథాలయ అధికారి పి.భాస్కర్‌రాజును రాష్ట్ర ఉపాధ్యక్షులుగా, సంతబొమ్మాళి గ్రంథాలయ అధికారి కె.రామకృష్ణను ఉత్తరాంధ్ర ప్రాంతీయ అధ్యక్షులుగా ఎన్నుకున్నట్లు తెలిపారు.

క్యాంపస్ డ్రైవ్‌లో 111 మంది ఎంపిక



ఉద్యోగాలకు ఎంపికైన ఆదిత్య ఇంజినీరింగ్ కళాశాల విద్యార్థులు

టెక్కలి: చెన్నైకు చెందిన ప్రముఖ సాఫ్ట్‌వేర్ కంపెనీ హెక్స్‌వేర్‌లో ఉద్యోగాలకు టెక్కలి ఆదిత్య ఇంజినీరింగ్ కళాశాలకు చెందిన 111 మంది విద్యార్థులు ఎంపికై నట్లు కళాశాల డైరెక్టర్ వి.వి.నాగేశ్వరరావు శనివారం తెలిపారు. కళాశాలలో నిర్వహించిన క్యాంపస్ డ్రైవ్‌లో భాగంగా ఈసీఈ, సీఎస్‌ఈ, ట్రిపుల్‌ఈ, ఐటీ విభాగాలకు చెందిన విద్యార్థులు ఉద్యోగాలకు ఎంపికైనట్లు ఆ పేర్కొన్నారు. వార్షిక వేతనం రూ.4 లక్షలు నుంచి రూ.6 లక్షల అందజేస్తారని వెల్లడించారు. ఈ సందర్భంగా విద్యార్థులను ప్రిన్సిపాల్ ఎ.ఎస్.శ్రీనివాసరావు, హెచ్‌ఓడీలు బి.రామారావు, యు.డి.ప్రసన్న, కె.కిరణ్‌కుమార్, వై.రమేష్, ప్లేస్‌మెంట్ ఇన్‌చార్జి సంతోష్ కుమార్ అభినందించారు.

గొలుసు చోరీపై ఫిర్యాదు

టెక్కలి రూరల్: మండలంలోని లింగాలవలస సమీపంలో బంగారు గొలుసును గుర్తు తెలియని వ్యక్తులు చోరీ చేశారంటూ పాతపట్నం మండలం గంగువాడ గ్రామానికి చెందిన అప్పారావు శనివారం టెక్కలి పోలీసులకు ఫిర్యాదు చేశారు. గంగువాడ నుంచి టెక్కలి వైపు ద్విచక్ర వాహనంపై వస్తుండగా మార్గమధ్యలో ఇద్దరు గుర్తుతెలియని వ్యక్తులు లిఫ్ట్ అడిగి ఎక్కారని, లింగాలవలస వచ్చే సరికి బండి ఆపమని చెప్పి దిగిపోయారని తెలిపారు. తీరా టెక్కలి వచ్చి చూసుకునే సరికి బంగారం గొలుసు కనిపించలేదని టెక్కలి పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

గుర్తు తెలియని వృద్ధురాలి మృతి


వృద్ధురాలి మృతదేహం

శ్రీకాకుళం క్రైమ్ : నగరంలోని రిమ్స్ ప్రభుత్వాసుపత్రి సమీపంలో ఈ నెల 6న ఔట్‌గేట్ సమీపంలో స్పృహ తప్పిపడిపోయిన వృద్ధురాలు శనివారం మృతి చెందినట్లు శ్రీకాకుళం రెండో పట్టణ పోలీస్ స్టేషన్ సీఐ పప్పల శ్రీనివాసరావు తెలిపారు. ఈమె రిమ్స్ పరిసర ప్రాంతాల్లో భిక్షాటన చేస్తూ జీవించేదని, ఆరోగ్యం క్షీణించడంతో నీరస ఎక్కువై స్పృహ కోల్పోయిందన్నారు. అనంతరం ఆస్పత్రిలో చేర్చగా చికిత్స పొందుతూ మృతిచెందిందన్నారు. కేసు నమోదు చేసినట్లు సీఐ చెప్పారు.

రైలు ఢీకొని మహిళ మృతి


మహిళ మృతదేహం

నరసన్నపేట: మండలంలోని ఉర్లాం రైల్వే స్టేషన్ సమీపంలో శుక్రవారం సాయంత్రం రైలు ఢీకొని 30 ఏళ్ల మహిళ మృతి చెందారని, ఆచూకీ తెలిస్తే సమాచారం ఇవ్వాలని ఆమదాలవలస రైల్వే ఎస్‌ఐ శ్రీనివాసరావు తెలిపారు. పువ్వుల ప్యాంట్, లైట్ గులాబి రంగులో టాప్ ధరించి ఉన్నట్లు పేర్కొన్నారు. వివరాలు తెలిసిన వారు ఆమదాలవలస రైల్వే పోలీసులకు సంప్రదించాలని కోరారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం శ్రీకాకుళం రిమ్స్‌లో భద్రపరిచామన్నారు.

గంజాయి కేసులో వ్యక్తికి రిమాండ్

జలుమూరు: శ్రీముఖలింగంలో గంజాయితో పట్టుబడిన కేసులో ఏడో ముద్దాయిగా ఉన్న బృందావతి రోలోను అరెస్ట్ చేసి కోటబొమ్మాళి కోర్టులో హాజరుపర్చగా శనివారం రిమాండ్‌కు తరలించినట్లు ఎస్‌ఐ పారినాయుడు తెలిపారు. ఇప్పటికే ఆరుగురిని రిమాండ్‌కు తరలించగా, బృందావతి రోలోను శ్రీముఖలింగం సమీపంలో ఉన్న కొబ్బరితోట వద్ద శుక్రవారం అరెస్ట్‌చేశామన్నారు. నరసన్నపేట సీఐ రాము కేసు దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

ఓటర్ల జాబితాలో.. మార్పులు.. చేర్పులు


ఇంటింటా ఓటరు సర్వేను పరిశీలిస్తున్న ఆర్డీఓ శాంతి

- ఇంటింటా ఓటర్ల సవరణ ప్రక్రియ ప్రారంభించిన బీఎల్‌ఓలు
- రాజకీయ పార్టీల సహకారంతో సర్వే నిర్వహణ
- ఆగస్టు 28 నాటికి తుది జాబితా సిద్ధం


బీఎల్‌వో యాప్

శ్రీకాకుళం పాతబస్టాండ్: ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు ఈ ఏడాది ఓటర్ల సవరణ మరింత కచ్చితంగా, పారదర్శకంగా రూపొందించేందుకు అధికారులు సన్నద్ధమయ్యారు. దీనిలో భాగంగా జిల్లా వ్యాప్తంగా బూత్ లెవెల్ అధికారులు వెరిఫికేషన్ ప్రక్రియ ప్రారంభించారు. ప్రతి ఇంటికీ వెళ్లి మొబైల్ యాప్‌లో ఓటర్ల పూర్తి వివరాలను నమోదు చేస్తున్నారు. సవరణలతో పాటు ఫొటో మార్పు, చేర్పులు, అడ్రస్ మార్పు వంటివి ఓటరు ఆమోదంతో చేస్తున్నారు.

విస్తృత అవగాహన..

ఓటర్ల సవరణ ప్రక్రియపై జిల్లా యంత్రాంగం విస్తృతంగా అవగాహన కల్పిస్తోంది. వివిధ ప్రసార మాధ్యమాల ద్వారా ప్రచారం చేయడంతో పాటు అవగాహన కార్యక్రమం నిర్వహిస్తోంది. ఇప్పటికే నియోజకవర్గాల స్థాయిలో బీఎల్‌ఓలకు, సంబంధిత అధికారులకు అవగాహన కల్పించారు. తాజాగా గురువారం కలెక్టర్ శ్రీకేష్ బి.లాఠకర్ వివిధ రాజకీయ పార్టీలతో సమావేశం నిర్వహించారు. ఓటర్ల సవరణ ప్రక్రియలో సహకరించాలని కోరారు. ఎన్నికలు సమీపిస్తున్న నేపథ్యంలో పారదర్శకమైన ఓటరు జాబితాను సిద్ధం చేసేందుకు పూర్తి సహకారం అందించాలన్నారు.

గడువులోగా..

ఓటరు జాబితా సవరణకు సంబంధించి ఇప్పటికే బీఎల్‌వోలకు శిక్షణ అందించారు. జిల్లాలో 8 శాసన సభా నియోజకవర్గాల పరిధిలో 2342 మంది బీఎల్‌వోలు ఉన్నారు. వీరికి బీఎల్‌వో ఓటరు యాప్ (వెర్షన్ 4.7) అందజేశారు. కొత్త ఓటు నమోదు, పాతవి తొలగించడం యాప్‌లోనే చేయాల్సి ఉంటుంది. కొత్తగా ఓటు హక్కు పొందాల్సిన వారు దరఖాస్తు నింపి బీఎల్‌ఓలకు అందించాల్సి ఉంటుంది. ఈ నెల 21 నుంచి ఆగస్టు 21 వరకు వెరిఫికేషన్ పూర్తి చేస్తారు. ఒకే కుటుంబంలో ఉన్న ఓటర్లందరినీ ఒకే పోలింగ్ స్టేషన్ అనుసంధానం చేసేందుకు ఇంటింటా సర్వే ఉపయోగపడుతుంది. వెరిఫికేషన్ అనంతరం ఆగస్టు 28 నాటికి పారదర్శకమైన, స్పష్టమైన ఓటర్ల జాబితా సిద్ధమవుతుంది.

నియోజకవర్గాల వారీగా ఓటర్లు..

నియోజకవర్గం	మొత్తం	పురుషులు	స్త్రీలు	ఇతరులు
ఇచ్ఛాపురం	25971	12727	13264	21
పలాస	210177	103350	106385	42
టెక్కలి	234606	117860	116728	18
పాతపట్నం	224665	112588	112060	17
శ్రీకాకుళం	263034	130814	132181	39
ఆమదాలవలస	189307	99246	95038	23
ఎచ్చెర్ల	237999	120462	117507	25
నరసన్నపేట	206918	103107	10394	17
మొత్తం	18,26,018	9,09,559	9,16,257	202

జిల్లా ఓటర్లు 18,26,018 మంది..

జిల్లాలోని ఎనిమిది శాసన సభా నియోజకవర్గాల్లో 23,92,844 మంది జనాభా ఉన్నారు.వీరిలో 11,90,921 మంది పురుషులు, 12,01,923 మహిళలు. ఓటర్లు 18,26,018 మంది ఉన్నారు. వీరిలో పురుషులు 9,09,559 మంది, స్త్రీలు 9,16,257 మంది, ఇతరులు 202 మంది ఓటర్లుగా ఉన్నారు. ఇంటింటా సవరణ కార్యక్రమం జరుగుతున్నందున 18 ఏళ్లు నిండిన వారంతా ఓటర్లుగా చేరే అవకాశం ఉంది. అదే స్థాయిలో మరణించినవారు, దీర్ఘకాలిక వలసలు వెళ్లినవారు, ఇతర ప్రాంతాల్లో ఓటు ఉన్న వారి ఓటు హక్కు రద్దవుతుంది.

సహకరించాలి

ఇంటింటా సర్వేను ఓటర్లు సద్వినియోగం చేసుకోవాలి. బీఎల్వోలు మీ ఇంటికి వచ్చినప్పుడు ఓటర్ ఐడీ కార్డులు, పేరు, చిరునామా, వయస్సు, ఆధార్, ఇతర వివరాలు సరిచేసుకోవాలి. ఫొటో చక్కగా లేకపోతే అక్కడికక్కడే ఫొటోను అప్‌డేట్ చేసుకోవాలి. పారదర్శక జాబితా పొందేందుకు ప్రజలు, రాజకీయ పార్టీలు పూర్తిస్థాయిలో సహకరించాలి.

– పి.మురళీకృష్ణ, డీఆర్‌ఓ, శ్రీకాకుళం

ప్రయాణికుల భద్రతే ముఖ్యం


జీఆర్‌పీ, ఆర్‌పీఎఫ్ సిబ్బందితో మాట్లాడుతున్న జీఆర్‌పీ లైన్స్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ వెంకటరావు

ఆమదాలవలస: రైల్వే ప్రయాణికుల భద్రతే ధ్యేయంగా సిబ్బంది విధులు నిర్వహించాలని విశాఖపట్నం జీఆర్పీ లైన్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ కె. వెంకటరావు సిబ్బందికి సూచించారు. శ్రీకాకుళం రోడ్ (ఆమదాలవలస) రైల్వేస్టేషన్‌ను శనివారం సందర్శించి రికార్డులను పరిశీలించారు. భద్రతా నియమాలపై ప్రయాణికులకు అవగాహన కల్పించాలని సూచించారు. విధులు సక్రమంగా నిర్వహించాలని, అక్రమ మాదక ద్రవ్యాల రవాణాను నిరోధించాలని తెలిపారు. కార్యక్రమంలో శ్రీకాకుళం జీఆర్పీ ఎస్‌ఐ జి.శ్రీనివాసరావు, ఆర్పీఎస్‌ఓటీ మనోజ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

భూముల రీసర్వే వేగవంతం


మాట్లాడుతున్న జేసీ నవీన్

టెక్కలి: ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న భూముల రీసర్వే ప్రక్రియ వేగవంతం చేయాలని జేసీ ఎం.నవీన్ అధికారులను ఆదేశించారు. భూముల రీసర్వేపై టెక్కలి, పలాస డివిజన్ అధికారులతో శనివారం టెక్కలిలో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ టెక్కలి డివిజన్‌లో 9 మండలాల్లో 52 గ్రామాల్లో 77,249.98 ఎకరాల్లో రీసర్వే చేయాల్సి ఉండగా ఇప్పటి వరకు 28,198.55 ఎకరాల్లో సర్వే పూర్తి చేశారని వివరించారు. పలాస డివిజన్‌లో 8 మండలాలకు సంబంధించి 45 గ్రామాల్లో 1,37,376.95 ఎకరాల్లో రీసర్వే చేయాల్సి ఉండగా ఇప్పటి వరకు 17,073.05 ఎకరాల్లో రీసర్వే పూర్తయిందన్నారు. కొన్ని గ్రామాల్లో రీ సర్వే తక్కువగా ఉండటంపై అసహనం వ్యక్తం చేశారు. సమావేశంలో టెక్కలి సబ్ కలెక్టర్ టి.రాహుల్‌కుమార్‌రెడ్డి, పలాస ఆర్డీఓ టి.సీతారామ్మూర్తి తదితరులు పాల్గొన్నారు.

నిబంధనల మేరకే మాత్రల పంపిణీ

మందస: మందస మండలంలోని సాబకోట పంచాయతీ బుడంబో గిరిజన బాలికోన్నత ఆశ్రమ పాఠశాలలో విద్యార్థినులకు నిబంధనల మేరకే క్లోరోక్విన్ మాత్రలు పంపిణీ చేశామని డీఎంహెచ్‌ఓ బి.మీనాక్షి శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. బుడంబో కాలనీ పీహెచ్‌సీ వైద్యాధికారి క్రమం తప్పకుండా సందర్శించినప్పుడు 142 మంది విద్యార్థినులకు మలేరియా స్క్రీనింగ్ చేశారని పేర్కొన్నారు. క్లోరోక్విన్ మాత్రలతో ఏదైనా ప్రొఫిలాక్టిక్ ట్రీట్‌మెంట్ ఇవ్వడం ప్రారంభించారన్నారు. 20వ తేదీన 3వ తరగతి నుంచి 5వ తరగతి వరకు చదువుతున్న 24మంది విద్యార్థినులకు మాత్రలు ఇవ్వగా, ఎలాంటి సైడ్ ఎఫెక్ట్స్ రాలేదన్నారు. 21న విద్యార్థినులు ఉదయం 7.30 గంటలకు టిఫిన్ చేశారని, 10.30 గంటలకు పీహెచ్‌సీ సిబ్బంది మందులు పంపిణీ చేశారని, ముగ్గురు విద్యార్థినిలు అల్పాహారం తీసుకోలేదన్నారు. మాత్రలు వేశాక కొద్దిపాటి వికారం, తల తిరగడం, శరీరం గగుర్పొడుచుకోవడం జరిగిందన్నారు. 34 మందికి వైద్యాధికారి ఆధ్వర్యంలో చికిత్స అందించగా, వారంతా కోలుకున్నారని తెలిపారు. ఒక విద్యార్థిని పలాస సీహెచ్‌సీకి తరలించగా, ఆమె కూడా కోలుకుందన్నారు. ప్రొఫిలాక్టిక్ థెరపీ నిలిపివేశామని, మూడు రోజుల పాటు వైద్యులు, సిబ్బందిని పర్యవేక్షణకు నియమించామన్నారు.

జీడి రైతు ఆత్మహత్య


సైని సింహాచలం (ఫైల్)

కాశీబుగ్గ: పలాస మండలం మాకన్నపల్లి గ్రామానికి చెందిన జీడి రైతు సైని సింహాచలం (67) ఆత్మహత్యకు పాల్పడ్డాడు. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. సింహాచలం కొద్ది రోజులుగా వివిధ రకాల సమస్యలతో బాధపడుతున్నాడు. అప్పుల బాధ తట్టుకోలేక ఎకరన్న జీడితోట అమ్మకం పెట్టాడు. కుటుంబ కలహాలు కూడా తోడవడంతో సోమవారం జీడితోటలో పురుగుల మందు తాగాడు. గమనించిన గ్రామస్తులు పలాస ప్రభుత్వ సామాజిక ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమించడంతో శ్రీకాకుళం రిమ్స్‌కు రిఫర్ చేశారు. అక్కడ చికిత్స పొందుతూ శనివారం మృతిచెందాడు. కాగా, సింహాచలంతో పాటు భార్య ఈశ్వరమ్మ ఇద్దరూ కిడ్నీ వ్యాధి బాధితులు ఇంటికే పరిమితం అయ్యారు. దీంతో ఆదాయం లేకపోవడం, ముగ్గురు కుమారులు ఉన్నా ఎవ్వరూ తల్లిదండ్రులతో సఖ్యతగా లేకపోవడం, భూములు అమ్ముకోవడం వెరసి మనస్తాపం చెంది ఆత్మహత్య చేసుకున్నట్లు స్థానికులు చెబుతున్నారు.

‘సేవల్లో లోపాలుంటే ఫిర్యాదు చేయండి’


మాట్లాడుతున్న జ్ఞాన సువర్ణరాజు

శ్రీకాకుళం పాతబస్టాండ్: ప్రజాప్రయోజన సేవల్లో ఎలాంటి అవాంతరాలు జరిగినా శాశ్వత లోక్‌అదాలత్‌ను సత్వరమే సంప్రదించాలని శ్రీకాకుళం జిల్లా శాశ్వత లోక్‌అదాలత్ న్యాయమూర్తి జ్ఞాన సువర్ణరాజు అన్నారు. శ్రీకాకుళం జిల్లా లోక్‌అదాలత్ సమావేశ మందిరంలో శనివారం ఏర్పాటు చేసిన ప్రత్యేక సమీక్షలో ఆయన మాట్లాడారు. జిల్లా వ్యాప్తంగా వివిధ ప్రభుత్వ శాఖలు అందిస్తున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు జిల్లా అధికారులను అడిగి తెలుసుకున్నారు. విద్యా, వైద్య రంగాల సేవల్లో లోపాలు ఉంటే సకాలంలో ఫిర్యాదు చేయాలని ఆయన కోరారు. సమావేశంలో శ్రీకాకుళం జిల్లా గృహనిర్మాణశాఖ పథక సంచాలకులు నక్క గణపతిరావు, నీటి యాజమాన్య సంస్థ పథక సంచాలకులు బి.చిట్టిరాజు, మెప్మా పీడీ ఎం.కిరణ్ కుమార్,ఆర్టీసీ, బ్యాంక్, అధికారులు పాల్గొన్నారు.

24, 25 తేదీల్లో ఆర్‌జీయూకేటీ ప్రవేశాల కౌన్సెలింగ్

ఎచ్చెర్ల క్యాంపస్: ఈ నెల 24, 25 తేదీల్లో శ్రీకాకుళం ట్రిపుల్ ఐటీ (రాజీవ్ గాంధీ వైజ్ఞానిక సాంకేతిక విశ్వవిద్యాలయం) ప్రవేశాలకు కౌన్సెలింగ్ నిర్వహించనున్నట్లు డైరెక్టర్ ప్రొఫెసర్ పెద్దాడ జగదీశ్వరరావు శనివారం తెలిపారు. కౌన్సెలింగ్ 24న రాష్ట్ర విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణ ప్రారంభించనున్నారని అన్నారు. రెండు పడక గదుల స్టాఫ్ క్వార్టర్స్ నిర్మాణానికి శంకుస్థాపన చేయనున్నారని పేర్కొన్నారు. విద్యార్థులకు పంపించిన కాల్ లెటర్స్ ఆధారంగా కౌన్సెలింగ్ నిర్వహించి ప్రవేశాలు కల్పిస్తామన్నారు. చాన్సలర్ ప్రొఫెసర్ కేసీ రెడ్డి హాజరు కానున్నారని అన్నారు.

● షూట్


ఫైరింగ్ చేస్తున్న ఎస్పీ రాధిక

ఎచ్చెర్ల క్యాంపస్: పోలీస్ శాఖ ఆధ్వర్యంలో అర్ధ వార్షిక ఫైరింగ్ సాధనను ఎచ్చెర్ల సమీపంలోని చినరావుపల్లి ఆర్మ్‌డ్ రిజర్వు ఫైరింగ్ రేంజ్‌లో శనివారం నిర్వహించారు. ఎస్పీ జీఆర్ రాధిక కార్యక్రమాన్ని ప్రారంభించారు. ప్రస్తుతం అందుబాటులోకి వస్తున్న వెపన్స్ పనితీరు, ఫైరింగ్ సాధన ప్రతి ఒక్కరూ చేయాలని అన్నారు. కార్యక్రమంలో అదనపు ఎస్పీలు టీపీ విఠలేశ్వరరావు, జె.తిప్పేస్వామి, అధికారులు పాల్గొన్నారు.

ఇచ్ఛాపురం రూరల్: ఇచ్ఛాపురం బెల్లుపడ కాలనీ ప్రాథమిక పాఠశాలలో పుస్తకాలతో విద్యార్థులు



అత్యద్భుత ప్రణాళిక.. పాఠ్య పుస్తకాల రాక

- సర్కారు బడుల్లో వందశాతం విద్యార్థులకు పుస్తకాల పంపిణీ
- మొదటి సెమిస్టర్‌లో 21,21,244 పాఠ్యపుస్తకాల అందజేత
- రెండో సెమిస్టర్‌లో 6,21,945 పుస్తకాల పంపిణీకి చర్యలు


పౌరసరఫరాల శాఖ నిత్యావసర సరుకుల పంపిణీ వాహనాల ద్వారా సారవకోటలో బడులకు పుస్తకాలు పంపిణీ చేస్తున్న దృశ్యం

శ్రీకాకుళం న్యూకాలనీ: ప్రభుత్వ పాఠశాలల్లో పుస్తకాల పంపిణీ విజయవంతంగా జరుగుతోంది. మూడేళ్లుగా బడి తెరిచిన తొలిరోజే సర్కారు జగనన్న విద్యా కానుకలతో పాటు పుస్తకాలు అందజేస్తోంది. గత ఏడాది మూడు సెమిస్టర్లతో పుస్తకాలను ముద్రించిన ప్రభుత్వం.. ఈ ఏడాది మాత్రం వాటిని రెండు సెమిస్టర్లకు కుదించింది. ఉమ్మడి శ్రీకాకుళం జిల్లా వ్యాప్తంగా మొదటి సెమిస్టర్‌కు సంబంధించి 21,21,244 పుస్తకాలు అవసరమని గుర్తించారు. వంద శాతం పుస్తకాలను పాఠశాలలకు చేర్చి వాటిని విద్యార్థులకు పంపిణీ చేశారు. ఇక అక్టోబర్/నవంబర్ నెల నుంచి బోధన మొదలయ్యే సెకండ్ సెమిస్టర్ పాఠ్యపుస్తకాల విషయంలోను సీఎం వైఎస్ జగన్మోహన్‌రెడ్డి ఎంతో దూరదృష్టితో ఆలోచన చేశారు. జూలై నెలాఖరుకే పాఠశాలలకు చేరే విధంగా సీఎం ఆదేశాల మేరకు విద్యాశాఖ అధికారులు పక్కాగా చర్యలు చేపట్టారు. రెండో సెమిస్టర్‌కు జిల్లాకు 6,21,945 పుస్తకాలు అవసరం కాగా.. ఇప్పటికే జిల్లా కేంద్రాలకు చేరుకున్న పాఠ్యపుస్తకాలను మండల కేంద్రాలకు, అక్కడ నుంచి పాఠశాలలకు చేర్చేలా రాష్ట్ర ప్రభుత్వం ప్రణాళిక రూపొందించింది.

అమెజాన్ ద్వారా..

రెండో సెమిస్టర్ పాఠ్యపుస్తకాలను పాఠశాలలకు చేరవేడంలో రాష్ట్ర ప్రభుత్వం వినూత్న ఆలోచన చేసి సక్సెస్ సాధించింది. జిల్లా కేంద్రానికి చేరుకున్న పాఠ్యపుస్తకాలను గతంలో ఎన్నడూ లేని విధంగా వివిధ రూపాల్లో బడులకు చేర్చింది. రెండో సెమిస్టర్ పాఠ్యపుస్తకాలను జిల్లా కేంద్రం నుంచి నేరుగా అమెజాన్ సంస్థ ద్వారా 9 మండలాల పరిధిలో 94 పాఠశాలలకు 5040 పుస్తకాలను పార్సిళ్లుగా చేరవేసింది. అలాగే మిగిలిన 6,16,905 పాఠ్యపుస్తకాలను ఆయా మండల కేంద్రాలకు చేర్చిన తర్వాత వాటిని అక్కడ నుంచి రాష్ట్ర పౌరసరఫరాల సంస్థ నిత్యావసర సరుకుల పంపిణీ వాహనాల ద్వారా పాఠశాలలకు చేరు. ఈ ప్రయోగం కూడా మంచి ఫలితాలను ఇచ్చిందని ఉపాధ్యాయులు చెబుతున్నారు.

వంద శాతం పంపిణీ చేశాం



బడి తెరిచిన తొలిరోజే విద్యార్థులకు పాఠ్యపుస్తకాలను పంపిణీ చేయాలన్నది ప్రభుత్వం ఆలోచన. అందుకు అనుగుణంగా విద్యాశాఖ తరఫున అన్ని చర్యలు తీసుకున్నాం. మొదటి సెమిస్టర్ పుస్తకాలను వంద శాతం పంపిణీ చేశాం. రెండో సెమిస్టర్ పుస్తకాలను కూడా ప్రభుత్వం ముందస్తుగా చేర్చడంలో ఎంతో దూరదృష్టితో వ్యవహరించింది. రెండో సెమిస్టర్ కోసం అవసరమైన 6,21,945 పుస్తకాలను బడులకు చేరవేశాం. 9 మండలాల్లో 94 బడులకు 5040 పుస్తకాలను జిల్లా కేంద్రం నుంచి అమెజాన్ సంస్థ ద్వారా నేరుగా పార్శిళ్లను పంపిణీ చేశాం. మిగిలిన చోట్ల మండల కేంద్రాల నుంచి పాఠ్యపుస్తకాలను పౌరసరఫరాల సంస్థ నిత్యావసర సరుకుల పంపిణీ వాహనాల ద్వారా పాఠశాలలకు చేరవేశాం.

– ఎస్.సతీష్, మేనేజర్, జిల్లా ప్రభుత్వ పాఠ్యపుస్తక కార్యాలయం శ్రీకాకుళం

కిడ్నీవ్యాధులపై సమరభేరి మోగిద్దాం


మాట్లాడుతున్న జిల్లా ప్రధాన న్యాయమూర్తి జునైద్ మౌలానా అహ్మద్

కవిటి/కంచిలి: ప్రభుత్వం కిడ్నీవ్యాధిగ్రస్తులకు అందిస్తున్న వైద్యసాయాలను, సంక్షేమ పథకాల్ని సద్వినియోగం చేసుకుంటూ కిడ్నీవ్యాధులపై సమరభేరి మోగిద్దామని జిల్లా ప్రధాన న్యాయమూర్తి జునైద్ మౌలానా అహ్మద్ పిలుపునిచ్చారు. శనివారం కవిటి మండలం మాణిక్యపురం పీహెచ్‌సీలో కిడ్నీ వ్యాధిగ్రస్తుల ఉచిత వైద్య శిబిరం, అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. ప్రజలు క్రమబద్ధమైన జీవనశైలి, వ్యాయామం, సంపూర్ణ పోషకాహారం పాటిస్తూనే ప్రతి మూడు నెలలకోసారి కిడ్నీపనితీరు రక్తపరీక్షల్ని చేయించుకోవడం ద్వారా ఆరోగ్యాన్ని కాపాడుకోవచ్చన్నారు. అనంతరం డాక్టర్ భాస్కర్, డాక్టర్ ధనలక్ష్మి ఆధ్వర్యంలో 281 మందికి వైద్య, రక్తపరీక్షలు నిర్వహించారు. స్థానిక పీహెచ్‌సీ నిర్మాణ పనులను అడిషనల్ డీఎంహెచ్‌ఓ అనూరాధ, పీఏసీఎస్ చైర్మన్ దేవరాజ్ పరిశీలించారు. కార్యక్రమంలో లీగల్ సర్వీసెస్ అథారిటీ సెక్రటరీ సన్యాసినాయుడు, సీనియర్ సివిల్ జడ్జి జె.శ్రీనివాసరావు, జూనియర్ సివిల్ జడ్జి పారిష్‌కుమార్, ఎంపీడీఓ పి.సూర్యనారాయణ, గ్రామపెద్దలు దేవరాజ్ సాహూ, లలితా సాహూ, సత్యవతి సాహూ, సంతోష్ సాహూ తదితరులు పాల్గొన్నారు.

అనంతరం మతంసరియాపల్లి పీహెచ్‌సీ ఆవరణలోనూ వైద్య శిబిరం నిర్వహించారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన న్యాయమూర్తి జునైద్ అహ్మద్ మౌలానా, అడిషనల్ డీఎంహెచ్‌ఓ అనురాధ, ఎంపీపీ పైల దేవదాస్‌రెడ్డి, నెఫ్రాలజిస్ట్ విద్యాసాగర్, రీజనల్ మెడికల్ ఆఫీసర్ భానుప్రకాశ్, సర్పంచ్ కె.సురేష్, వైద్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

కేసుల దర్యాప్తు వేగవంతం చేయాలి


ఎస్పీ చేతుల మీదుగా ప్రశంసాపత్రాన్ని అందుకుంటున్న ట్రాఫిక్ డీఎస్పీ ప్రసాదరావు

శ్రీకాకుళం క్రైమ్ : అతి తీవ్ర నేరాల కేసులతో పాటు ప్రాధాన్యతా కేసుల దర్యాప్తు ముమ్మరం చేయాలని ఎస్పీ రాధిక పోలీసు అధికారులను ఆదేశించారు. శనివారం జెడ్పీ సమావేశ మందిరంలో జూన్ నెలకు సంబంధించి నెలవారీ సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ గ్రేవ్, ప్రాపర్టీ నేరాలు, ఫోక్సో, ఎస్సీ, ఎస్టీ, ఎన్డీపీఎస్, మిస్సింగ్ కేసులు, సైబర్ నేరాలు, రోడ్డు ప్రమాదాలపై అధికారులకు దిశా నిర్దేశం చేశారు. అనంతరం నేరాలు, మిస్సింగ్ కేసుల ఛేదన, కేసుల పరిష్కారం, దర్యాప్తు, సమాచారం సేకరణ, సీసీ కెమెరాల ఏర్పాటు, రోడ్డు ప్రమాదాల నివారణాచర్యలు, బెస్ట్ ఫైరింగ్ వంటి పలు అంశాలపై ప్రతిభ కనబర్చిన సిబ్బందికి ప్రశంసాపత్రాలు అందించారు. వీరిలో ట్రాఫిక్ డీఎస్పీ సిహెచ్‌జీవీ ప్రసాదరావు, సీఐలు జి.శ్రీనివాసరావు, పి.శ్రీనివాసరావు, ఎస్‌ఐలు బలివాడ గణేష్, అలీ మహ్మద్, బి.హైమావతి, ఎల్.రామకృష్ణ, ఎస్.బాలరాజు, ఎ.విజయ్‌కుమార్, ఎం.గోవిందరావు, ఎ.కోటేశ్వరరావు, జి.రాజేష్, మహిళా పోలీసులు ఎస్.గాయత్రి, టి.తేజవతి, ఎ.హారతి ఉన్నారు. సమావేశంలో అదనపు ఎస్పీలు టి.పి.విఠలేశ్వరరావు, జె.తిప్పేస్వామి, డీఎస్పీలు డి.బాలచంద్రరెడ్డి, యర్రగుంట శృతి, నాగేశ్వరరెడ్డి, ఎస్.బాలరాజు, ఎస్.వాసుదేవ్, సీహెచ్‌జీవీ ప్రసాదరావు తదితరులు పాల్గొన్నారు.